కథానిక

ఆఫీసుల అంతస్థులు

శ్రీ 'వసంతవిహార్'

I

లే. నం. /55

జిల్లాప్రధానకార్యాలయం,
.....నగరం,
1-8-55.

అత్యవసర తాఖీదు

విషయం: ధరల పెంపుదల-మాసవారీ రిపోర్టు - సకాలములో పంపకపోవుటకు సంజాయిషీ.

పూర్వవృత్తము: I ఈ ఆఫీస్ రి.../55. తాఖు 29-6-55

II తాలూకా కార్యాలయము యొక్క లె. నెం. .../55 తారీఖు 27-7-55.

పైన పేర్కొన్న II వ అంశములో తాలూకా కార్యాలయము నుండి ధరల పెరుగుటను గురించి రావలిసిన జూన్ '55 నెల తాలూకు మాసవారీ రిపోర్టు లోగడనే పంపినట్లు వ్రాసినారు. ఆ రిపోర్టు ఇంతవరకు ఇక్కడకు అందలేదు. అది ఏ పరిస్థితులలో పంపబడలేదో తాలూకా కార్యాలయ ప్రధానాధికారి యీ మెమో అందుకున్న మరుసటిరోజు టపాలో వెంటనే జవాబు వ్రాసుకోవలయును.

ఈ విషయములో ... కార్యాలయాలు ఆలస్యం చేయడంవల్ల అక్కడి పరిస్థితులు పైకి వివరించి వ్రాసి సత్వర సహాయం పొందటానికి వీలులేకుండా పోతుంది. ఈ విషయాన్ని క్షుణ్ణంగా తాలూకా అధికారులు గ్రహించాలి.

ఇందు విషయమైన, అవసరమైన ఆజ్ఞలు యీ ఆఫీస్ రి. జి - 2/55 తా. 25-5-55 లో వివరించి యున్నాము.

సం. జిల్లా ప్రధాన కార్యాలయపు ప్రధానోద్యోగి తరఫున—
...తాలూకా కార్యాలయోద్యోగికి
(పేరున)

II

తాలూకా కార్యాలయం,
.....పురం,
రి. నెం. యఫ్ 2145/55
15—8—55

అయ్యా,

వి: ధరల పెంపుదల - మాసవారీ రిపోర్టు - జూన్ 1955 - పంపుకొనడమైనది - గురించి.

పూ: తమ ఆఫీస్ తే. నం. /55 తా. 1-8-55.

పైన పేర్కొన్న విషయమును గురించిన మాసవారీ రిపోర్టు యీ ఆఫీస్ రి. నెం. యఫ్. 2145/55 తే. 1-7-55 తో పాటు పంపుకున్నామని సవినయముగా దాఖలు చేసుకొనుచున్నాను. ప్రత్యేక నాఖరు ద్వారా ఆ కవరు జిల్లా ప్రధానకార్యాలయానికి 1-7-55 సాయంత్రం 5.30 గం॥ లకు చేర్చినట్లు తెలుస్తోంది.

తమ ఆఫీస్ రి. జి-2/55 తా 25-5-55 యీ ఆఫీస్‌లో ఎంతవెతికినను కన్పడుటలేదని మనవిచేసుకుంటూ అందు వివరింపబడ్డ 'ఆజ్ఞల' కాపీ నొకదానిని దయచేయించవలసినదిగా కోరుచున్నాను.

పై ఆజ్ఞలు జారీఅయిన వెంటనే నేను పూర్తిజవాబు దాఖలు చేసుకోగలవాడను.

సం.
తాలూకా కార్యాలయోద్యోగి.

III

లే. నం.../55

జిల్లా ప్రధానకార్యాలయం,
...నగరం,
1—9—55

ప్రధానావసరపు లేఖ

ప్రియమైన ..... గారికి,

వి: ధరల పెంపుదల - మాసవారీ రిపోర్టు - జూన్ 1955 —

సకాలములో పంపకపోవుటను గురించి —

పూ: 1. యీ ఆఫీస్ లే. నం.../55 తా॥ 1—8—55.

2. మీ ఆఫీస్ రి. నెం. యఫ్. 2145/55 తా॥ 15-8-55.

పైన పేర్కొన్న విషయములోనికి మీరు వెంటనే వ్యక్తిగతంగా తగు విచారణనుజరిపి అనవసరముగా జరుగుతున్న అనంతమైన జాగును అరికట్టునట్లు చేయవలెను.

జూన్ నెలలో ధరల పెంపకమును గూర్చిన మాసవారీ రిపోర్టు యీ ఆఫీస్‌కు ది 1-7-55 నకే పంపుకోవలసినదిగా యున్నది. కానీ అది అందలేదని యీ ఆఫీస్ లె నం.../55 తా॥ 1-8-55లో పేర్కొనడమైనది. అయినా మీరు ఇంతవరకు దానిని పంపలేదు. గవర్నరు గారికి పంపవలసిన రిపోర్టు ఆగిపోయి వున్నది.

మీ ఆఫీస్ రి. నెం. యఫ్ 2145/55 తా॥ 1-7-55 తోపాటు రిపోర్టు పంపినట్లు వ్రాసియున్నారు. దానికాపీ నొకదానిని వెంటనే దాఖలు చేసుకొనగలవు.

ఈ విషయంలో ఇకనైనా జాగు యున్నూ సహింపబడదని మీరు గుర్తించవలెను.

మీరు కోరినట్లు 'ఆజ్ఞల' కాపీ యిందులో జతపర్చడమైనది.

భవదీయుడు,

★

శ్రీ.....గారికి, (.....)
తాలూకా కార్యాలయోద్యోగి
.....పురం.

IV

రి. నె. 2145/55 తాలూకా కార్యాలయం...పురం,
10-9-55

ఘనమైన అయ్యా,

వి: ధరల పెంపుదల మాసవారీ రిపోర్టు - జూన్ 1955 - పంపుకొనుటను గురించి.

పూ: మీ ఆఫీస్ అత్యవసరపు లే. నం ... 55/ తా. 1-9-55.

ఈఆఫీస్ రి. నెం.యఫ్. 2145/55 తా॥ 1-7-55 యొక్క కాపీ యిందుతో దాఖలు చేసుకొనుచున్నాను.

విధేయుడు,

శ్రీ.....గారు (.....)
జిల్లా ప్రధాన కార్యాలయోద్యోగికి
.....నగరం.

ఈ ఆఫీస్ రి. నెం. 2145/555 తా. 1-7-55 యొక్క నకలు.

వి. ధరల పెంపుదల - మాసవారీ రిపోర్టు - దాఖలు చేయుట.

ఇందుతో జూన్ 1955 వ నెల తాలూకు ధరల పెంపకపు మాసవారీ రిటర్ను దాఖలు చేసుకొనుచున్నాను.

సం.

సరియైన నకలు

సం.
—తాలూకా కార్యాలయోద్యోగి తరఫున.

V

జిల్లా ప్రధాన కార్యాలయం,
లె. నం. .../55 ...నగరం,
మెమో 20-9-55.

వి: ధరల పెంపుదల - జూన్ నెల 1955 - మాసవారీ రిపోర్టు దాఖలు చేయకపోవుటను గురించి.

పూ: తాలూకా కార్యాలయపు రి. నెం. యఫ్ 2145/55.
తా. 10—9—55.

పైన పేర్కొన్న తాలూకా రి. నెం. తోపాటు పంపిన తాలూకా రి. నెం. యఫ్. 2145/55 తా॥ 1-7-55 తో జూన్ నెల మాసవారీ రిపోర్టు పంపుకొన్నట్లు మాత్రమే వున్నది. ఆ రిటర్నులోని ధరలు వెంటనే ప్రభుత్వానికి తెలియబర్చాల్సి రావటంవల్ల తాలూకా కార్యాలయోద్యోగి వెంటనే ఆ రిటర్ను కాపీ పంపవలెను.

ఇది అత్యవసరముగా గ్రహించవలెను. ఆసామాషీ జవాబులవల్ల ఫలితము లేదని తాలూకా కార్యాలయోద్యోగి యికనుంచైనా తెల్సుకోవలెను.

సం.
—జిల్లాకార్యాలయ ప్రధానోద్యోగి తరఫున.

VI

తాలూకా కార్యాలయం,
రి. నెం. యఫ్. 2145/55
.....పురం,
1—10—55

అయ్యా,

వి: ధరల పెంపుదల - జూన్ 1955 మాసవారీ రిపోర్టు పంపుకొనుటను గురించి.

పూ: మీ ఆఫీసు లె. నం.../55 తే. 20—9—55.

ప్రస్తుతము 'ధరలపెంపుదల' సీట్ పని చూస్తున్న గుమస్తా కొత్తవాడవటంవల్ల, పూర్వపు గుమస్తా ఫైళ్ళు సరిగా అప్పజెప్పక పోవటంవల్ల 1955 జూన్ నెల తాలూకా రిపోర్టు ఎంతవెతికినను కనబడుటలేదని మనవి చేస్తున్నాను.

అన్ని విషయములు తెలుసుకొని, తగుచర్యలు తీసుకొని ఒక పక్షము రోజులలోగా తమకు జవాబు పంపుకోగలవాడను.

సంపూర్ణంగా ఆజ్ఞలు యిచ్చిన లె. నం. /55 తా॥... ఇంతవరకు మాకు పంపడియుండలేదనియు, అది వెంటనే పంపగలరనియు కోరుచున్నాను.

సం.
తాలూకాకార్యాలయోద్యోగి.

vii

జిల్లా ప్రధాన కార్యాలయం,
లె. నెం.../55. .....నగరం,
అత్యవసరపు నోటీసు 11-11-55

వి: ధరల పెంపుదల - మాసవారీ రిటర్ను - జూన్ 1955-వైనానుగురించి

పూ: తాలూకా కార్యాలయపు రి. నెం. యఫ్. 2145/55 తా. 1-10-55

ఒక పక్షముగా తమ రిపోర్టును దాఖలు చేసుకొనేదని పైన పేర్కొన్న తాలూకా రి. నెం. లో తాలూకా కార్యాలయోద్యోగి వాగ్దానము చేసియున్నాడు. ఇంతవరకు అది "దాఖలు చేయుటకియుండలేదు"

ఈ విషయములో పై అధికారులు ఎక్కువగా పట్టుపడి చేస్తున్నారనే విషయం అతడు గుర్తించవలెను.

రిపోర్టు 1-12-55 లోగా యీ ఆఫీస్‌కు అందక యెడల కఠినమైన తగు చర్య గైకొనబడునని హెచ్చరిచడమైంది.

సం.
జిల్లా ప్రధాన కార్యాలయపు
ఉద్యోగి తరఫున

viii

తాలూకా కార్యాలయం, రి. నెం. యఫ్ 2145/55.
.....పురం,
1—12—55.

అయ్యా,

వి. ధరలపెంపుదల - మాసవారీ రిటర్ను - జూన్ 1955 - వగైరానుగురించి.

పూ: మీ ఆఫీస్ లేనం...../55 తా. 11—11—55.

ఎంత వెదికినను జూన్ నెల తాలూకు రిపోర్టు నకలు దొరకలేదనియూ, అందుకు సంబంధించిన గుమస్తామీద తగు చర్య తీసుకోబడునని యూ మనవి చేయుచున్నాను

జూన్ నెలకు సంబంధించిన ధరలను స్థానికంగా సేకరించి త్వరలో పంపుకోగలవాడను.

తమ ఆఫీసు జి-2/55 తా-25-5-55 తాఖీదు నకలును పంపవలసిందిగా ఇదివరలో కోరియున్నాను. అది త్వరలో పంపగలందులకై ప్రార్థిస్తున్నాను.

సం.
—తాలూకా కార్యాలయపు
ప్రధానోద్యోగి తరఫున

ix

జిల్లా ప్రధాన కార్యాలయం,
లె. నెం.../55
...నగరం
6—1—56

శ్రీ..... జిల్లా ప్రధానోద్యోగి నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ ప్రధాన కార్యాలయం...కు.

వి: ధరల పెంపుదల - ధరలను - గురించి.

పూ: కవర్నమెంటు ఉత్తర్వు నెం. 4134 - ఆదాయ వ్యయాల - 55 చిత్తు ప్రతి - 5వ పేజీ తాఖీదు నెం 2 (1)

జిల్లాలోని క్రింది ఆఫీసులన్నింటి నుండియు ఇంకనూ జవాబు రాలేదు. వచ్చిన వెంటనే జూన్ 1955 సం॥ లోని ఆహారధాన్యాదుల మొ॥ అత్యవసర వస్తువుల ధరల పట్టికను అందుతోపాటు జూన్ 1954 లోని ధరల వివరములను దాఖలు చేసుకోగలవాడను.

సం.
జిల్లా కార్యాలయోద్యోగి
నకలు
.....నగరపు తాలూకా కార్యాలయోద్యోగికి పంపటమైనది. అతడు వెంటనే జవాబు వ్రాసేది.

సం.
జి. కా. ఉ.

X

తాలూకా కార్యాలయం రి. నెం. 2145/55
యఫ్ ...నగరం
31—1—56.

అయ్యా:

వి: ధరల పెంపుదల - జూన్ నెలలోని ధరల వివరం పంపుకొనడమైనది.

పూ: మీ లె. నం...../55 తా॥ 6-1-56 యొక్క నకలు.

ఇందులో 1955 జూన్ నెలలోని ఆహార ధాన్యాదుల యొక్క ధరల పట్టిక జతపర్చడమైనది.

సం.
తాలూకా కార్యాలయోద్యోగి
త్రిప్పివేయడమైనది

2. ప్రస్తుతమున్న ధరలు జూన్ నెల 1955 ధరలకంటె 20% తగ్గు ముఖంగా ఉండటాన్ని దృష్టి లో పెట్టుకొని 'చౌకడిపోలు' పెట్టటం గురించి ప్రభుత్వం ఆలోచించిన పథకాన్ని విరమించుకొంది. తాలూకా కార్యాలయోద్యోగి యిందు విషయమై జిల్లాకార్యాలయానికి ఎట్టి రిపోర్టు పంపుకోనక్కరలేదు.

సం.
జిల్లా కార్యాలయోద్యోగి.
16-2-56.

"ఈజిప్టుపై సాయుధ దురాక్రమణను యత్నాన్ని పూర్తిగా ఎదరించుతాం"

చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభను ప్రారంభిస్తూ మావో సేటుంగ్ హెచ్చరిక

[చైనా కమ్యూనిస్టుపార్టీ, అష్టమ జాతీయ మహాసభను ప్రారంభించుతూ మావో సేటుంగ్ సెప్టెంబరు 15 న ఇచ్చిన ఉపన్యాసం పూర్తి పాఠాన్ని పాఠకులకు సమర్పించుతున్నాం.—సం.]

చైనా కమ్యూనిస్టుపార్టీ అష్టమ జాతీయ మహాసభను ప్రారంభించుతున్నాను. (దీర్ఘహర్షధ్వానాలు)

పార్టీ సప్తమ మహాసభ జరిగి 11 ఏండ్లయింది. ఈ పదకొండు సంవత్సరాలలో, ఇక్కడ మనదేశంలోనూ, ప్రపంచమంతటానూ, కమ్యూనిజంకోసం, మానవ విముక్తికోసం నిరవధికంగా పాటుపడుతూ, వీరోచితంగా పోరాడుతూ ఎందరో కామ్రేడ్‌లు, స్నేహితులు తమ ప్రాణాలను అర్పించారు. వారిని మనం సర్వదా గౌరవించుదాం. (అందరూ మౌనంగా నిలబడి అమరవీరులపట్ల గౌరవాన్ని వ్యక్తపరుచుతారు)

ఏడవ కాంగ్రెస్ తర్వాత మనం సంపాదించిన అనుభవాన్ని క్రోడీకరించడం; పార్టీనంతనూ ఐక్యపరచడం; సోషలిస్టు మహావైనాను నిర్మించేందుకై మన దేశంలోను, విదేశాలలోను ఐక్యం చేయవలసిన శక్తులన్నిటినీ ఐక్యపరచడం - ఈ మహాసభ కర్తవ్యం. (హర్షధ్వానాలు)

మనదేశం చాలా విశాలమయినది. పెద్ద జనభా కలది. ఇక్కడ క్లిష్టమైన పరిస్థితులున్నాయి. అలాంటి మన దేశంలో ఈ 11 ఏండ్లలో, మనం బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తిచేశాం. సోషలిస్టు విప్లవంలో నిశ్చిత విజయాన్ని కూడా సాధించాం ఏడవ కాంగ్రెస్‌నుండి నేటివరకు పార్టీ కేంద్రకమిటీ అవలంబించిన విధానం సరియైనదని ఆచరణలో ఈ రెండు విప్లవాలలోనూ రుజువయింది. మన పార్టీ రాజకీయ పరిపక్వత పొందిన మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీ అని రుజువు అయింది (హర్షధ్వానాలు). గతంలో ఎన్నడూ లేనంతగా ఈనాడు మనపార్టీ ఐక్యంగానూ, సుసంఘటితంగానూ వుంది. (హర్షధ్వానాలు). సోషలిస్టునిర్మాణం కోసం యావద్దేశ ప్రజలను ఐక్యపరచుటలో మనపార్టీ గుండెయలాగా పనిచేసింది. (హర్షధ్వానాలు). ప్రతిరంగంలోనూ మనం గొప్పవిజయాలను సాధించాం. మనం మన పనిని సరిగా చేశాం, కాని కొన్ని పొరపాట్లుకూడా చేశాం. ఈ మహాసభలో మనం మన పనిలోని ప్రధాన అనుభవాన్ని - విజయాలను పొరపాట్లనుకూడా-క్రోడీకరించాలి. తత్ఫలితంగా విజయవంతమైన అనుభవాన్ని ప్రచారం చేయవచ్చు; మన తప్పులనుండి గుణపాఠాలుకూడా నేర్చుకోవచ్చు.

అంతరంగికపరిస్థితికి సంబంధించినంతవరకు మన విజయాలకు కారణం, కార్మికవర్గ నాయకత్వాన నిర్మించిన కార్మిక-కర్షక మైత్రిపై మనం ఆధారపడ్డాం. ఐక్యపరచవలసిన శక్తులన్నిటినీ విస్తృతంగా ఐక్యపరచాం. నిర్మాణ మహాకార్యం మనలను ఎదుర్కొనివుంది. ఈ కార్యాన్ని నిర్వర్తించడంలో గొప్పభారమైన కర్తవ్యాలు మనపై ఉన్నాయి. మన పార్టీలో కోటిమందికి పైగా సభ్యులున్నప్పటికీ, మనదేశ జనాభాతో పోల్చుకొంటే ఈసంఖ్య చాలాచిన్నది. అనేక ప్రభుత్వ శాఖలలో, అనేక ప్రజావ్యవహారాలలో, పార్టీయేతర ప్రజలు చేసేపని చాలా వుంటుంది. ప్రజాబాహుళ్యంపైన ఆధారపడటంలోను, పార్టీయేతర ప్రజలతో సహకరించడంలోనూ మనం సిద్ధహస్తులం కాకపోయినట్లయితే, పని బాగా జరగడం అసాధ్యం. పార్టీ ఐక్యతను బలపరచడం కొనసాగించుతూనే, వివిధ జాతులన్నిటిలో, ప్రజాతంత్ర వర్గాలన్నిటిలో, ప్రజాతంత్రపార్టీలన్నిటిలో, ప్రజాసంస్థలన్నిటిలో ఐక్యతను పెంపొందించడానికి మనం కృషి చేయాలి. ప్రజాతంత్రవిప్లవసంఘటనను (పీపుల్స్ డెమాక్రటిక్ యునైటెడ్ ఫ్రంట్) సుసంఘటిత పరచి విస్తృత మైనదిగా చేయాలి. పార్టీకి ప్రజలకుగల ఐక్యతకు దెబ్బతగిలే అవాంఛనీయ లక్షణాలు ఏమైనా వుంటే వాటిని మన పనినుండి తొలగించడానికి కృత నిశ్చయులం కావాలి.

సోవియట్ యూనియన్ నాయకత్వాన శాంతి, పజాతంత్ర, సోషలిస్టు శిబిరం మనలను బలపరచడంవల్ల, ప్రపంచ వ్యాపిత శాంతి కాముక ప్రజలు గొప్పానుభూతిని వ్యక్తపరచినందువల్ల, అంతర్జాతీయంగా మనం విజయాలను సాధించాం. ప్రస్తుతం, మన దేశంలో నిర్మాణ కార్యక్రమం కొనసాగించడానికి అంతర్జాతీయ పరిస్థితులు ఎక్కువ అనుకూలంగా వున్నాయి. మనమే గాక సోషలిస్టు దేశాలన్నీ శాంతిని వాంఛిస్తున్నాయి. ప్రపంచంలోని సమస్త దేశాల ప్రజలు శాంతిని వాంఛిస్తున్నారు. యుద్ధం కోసం పరితపిస్తూ శాంతిని కోరేవారు సామ్రాజ్యవాద దేశాలలోని కొద్దిమంది గుత్త పెట్టుబడిదారులు మాత్రమే. దురాక్రమణ ద్వారా తాము లాభాలు సంపాదించాలని వారి కోర్కె. శాంతికాముక దేశాల, ప్రజల, నిరంతర ప్రయత్నాల ఫలితంగా, అంతర్జాతీయ పరిస్థితిలో ఉద్రిక్తత సడలి-ధోరణికనబడుతూంది. ప్రపంచంలో సుస్థిరశాంతిని సాధించడానికి, సోషలిస్టు శిబిరంలోని సోదర దేశాలతో స్నేహపూర్వకారాలను మనం మరింత వృద్ధిచేయాలి; శాంతికాముక దేశాలన్నిటితో ఐక్యతను దృఢపరచాలి (హర్షధ్వానాలు) మనతో శాంతియుతంగా జీవించాలని కోరే అన్నిదేశాలతోను ఈ కింది ప్రాతిపదికపైన మామూలు దౌత్య సంబంధాలను యేర్పరచుకోడానికి ప్రయత్నించాలి ఆ ప్రాతిపదిక ఇది: ప్రాదేశిక భద్రతను సార్వభౌమాధికారాన్ని పరస్పరం గౌరవించడం; సమానత; పరస్పరలాభం; ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని జాతీయ స్వాతంత్ర్య ఉద్యమాలకుమనం పూర్తిసహకారాన్నివ్వాలి. ఇంతేగాక శాంతి ఉద్యమాన్ని, ప్రపంచమందలి దేశాలన్నిటిలోను న్యాయమైన పోరాటాలను మనం బలపరచాలి. (హర్షధ్వానాలు) సూయజ్ కాలువ కంపెనీని తిరిగి తమ స్వాధీనం చేసుకొనుటలో ఈజిప్ట్ ప్రభుత్వం పూర్తిగా చట్టయుతంగానే ప్రవర్తించింది. దానిని మనం గట్టిగా బలపరుస్తున్నాం. ఈజిప్ట్ సార్వభౌమాధికారాన్ని అతిక్రమించి, ఆదేశంపై సాయుధ దురాక్రమణకై చేసే ప్రయత్నాన్ని మనం పూర్తిగా ఎదిరించుతాం (హర్షధ్వానాలు). ఉద్రిక్తపరిస్థితిని కల్గించి యుద్ధానికి తయారుకాజూస్తున్న సామ్రాజ్యవాదుల పన్నాగాలను మనం పూర్తిగాభగ్నపరచాలి.

మన దేశంలో విల్లవ విజయాలు, మార్క్సిజం-లెనినిజానికి విజయాలు. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా విప్లవ ఆచరణతో సన్నిహితంగా మేళవించడం అనేది మనపార్టీ నిరంతరం ఆచరించుతూవచ్చినసిద్ధాంత సూత్రం. పార్టీలోపనిచేసేవిధానాన్ని సరిదిద్దడానికి 1942 లో ఉద్యమం ప్రారంభించిన తర్వాత చాలా సంవత్సరాలు మనం పార్టీలో మార్క్సిస్టు - లెనినిస్టు బోధనను గట్టిపరచడానికి చాలా కృషిచేశాం. ఈ ఉద్యమం ప్రారంభించడానికి పూర్వపుదశతో పోల్చిచూస్తే ఇపుడు, పార్టీ మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంత స్థాయిని పెంచడానికి అది కృషి చేసింది. అయినా ఇంకా తీవ్రమైన లోపాలున్నాయి. మన కామ్రేడ్‌లలో చాలామంది, మార్క్సిజం - లెనినిజంకు విరుద్ధమైన పని పద్ధతులు దృక్పథాలుఉన్నవారున్నారు. అంటే, తమ ఆలోచనా ధోరణిలో ఆత్మాశ్రయ పద్ధతి (సబ్జెక్టివిజం) పనిచేసే విధానంలో నిరంకుశత్వం, నిర్మాణ సమస్యల విషయంలో ఒంటెత్తుపోకడ (సెక్టేరియనిజం) వారు అవలంబించుతున్నారు. అలాంటి దృక్పథాలు, అలాంటి పనివిధానాలు, ప్రజలనుండి మనల్ని దూరంచేస్తున్నాయి, వాస్తవాన్నుండి మనల్ని దూరంచేస్తాయి, పార్టీలోపల, బయట ఐక్యతకు హాని కలిగిరచుతాయి, మనఆశయ అభివృద్ధికి, మన కామ్రేడ్స్‌కు అవి హానికలిగించుతాయి. మనలోఉండే అలాంటి తీవ్రమైన లోపాలను తీవ్రంగా సరిదిద్దుకోవాలి పార్టీ సిద్ధాంతరీత్యా విద్యగఱపుకొంటూ బలపడాలి. (హర్షధ్వానాలు)

అక్టోబరు విప్లవం తర్వాత, "అధ్యయనం చేయండి, తిరిగి అధ్యయనం చేయండి" అనే కర్తవ్యాన్ని లెనిన్ సోవియట్ కమ్యూనిస్టుపార్టీముందు ఉంచాడు. లెనిన్ యొక్క ఈ ఆజ్ఞ ననుసరించి సోవియట్ కామ్రేడ్‌లూ, ప్రజలూ పనిచేశారు. ఎంతోకాలం జరగలేదు, అయినా సోవియట్ సాధించిన విజయాలు అత్యంత అద్భుత విజయాలు. (దీర్ఘ హర్షధ్వానాలు.) ఇటీవలనే జరిగిన పార్టీ ఇరవయ్యో కాంగ్రెసులో, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ అనేకమైన సరియైన విధానాలను అవలంబించింది. తన పనిలో గల లోపాలను విమర్శించింది. సోవియట్ పార్టీ పనిలో దీని తర్వాత చాలా గొప్పపరిణామాలు జరగగలవని బల్లగుద్ది చెప్పవచ్చు. (దీర్ఘ హర్షధ్వానాలు).

సోవియట్ యూనియన్ ఏర్పడిన ప్రాథమిక దినాలలో ఆదేశం ఎదుర్కొన్నలాంటి కర్తవ్యాలే మేము మనమూ ఎదుర్కొంటున్నాం. వెనుకబడిన వ్యవసాయ దేశంనుండి అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశంగా చైనాను పరివర్తించడంలో మనకు అనేక భారీ కర్తవ్యాలు ఎదుర్కొంటున్నాయి. మన అనుభవం చాలడంలేదు. అందుచేత, మనం అధ్యయనం చేయడంలో నేర్పరితనం వహించాలి మన అగ్రగామి సోవియట్‌నుండి నేర్చుకోవాలి. (హర్షధ్వానాలు). (తూర్పు యూరప్ - ప్రజాస్వామిక దేశాల) నుండి నేర్చుకోవాలి. (హర్షధ్వానాలు) ప్రపంచంలోని ఇతర దేశాల సోదర పార్టీలనుండి నేర్చుకోవాలి. (హర్షధ్వానాలు) ప్రపంచ ప్రజలనుండి కూడా నేర్చుకోవాలి. (హర్షధ్వానాలు) మహాజాతి అనే దురహంకారంతో గర్వబోతు ధోరణిని మనం ఎన్నడూ అవలంబించలేదు. విప్లవ విజయాలతో దేశ నిర్మాణంలో సాధించిన కొన్ని విజయాలతో ఆత్మసంతృప్తి చెంది గర్వస్థులం కాగూడదు. మనం చాలా గొప్ప విజయాలను సాధించినప్పటికీ కూడా, ఆత్మసంతృప్తి చెందవలసిన అవసరంగాని, గర్వబోతు దనం అలవర్చుకోవలసిన పనిగానిలేదు. వినయం అభివృద్ధికి దారితీస్తుంది గర్వబోతుతనం, వెనకపడేటట్లు చేస్తుంది. మనం ఎప్పుడూ ఈ సత్యాన్ని గుర్తుంచుకోవాలి (హర్షధ్వానాలు).

కామ్రేడ్స్, స్వతంత్రులయిన చైనా, ప్రజల బలం అంతులేనిదని మీరూ, నేనూ నమ్ముతున్నాం. ఇంతేగాక, మన మహామిత్రదేశం సోవియట్ యూనియన్, ఇతరసోదర దేశాల సహాయం మనకు వుంది (హర్షధ్వానాలు) సోదర కమ్యూనిస్టుపార్టీల అండ మనకు వుంది (హర్షధ్వానాలు) ప్రపంచమంతటా వ్యాప్తి చెందివున్న మన సానుభూతిపరుల అండ మనకు వుంది. (హర్షధ్వానాలు) మనం ఇపుడు ఒంటరిగాలేము. మన దేశాన్ని మెట్టు మెట్టుగా గొప్ప సోషలిస్టు పారిశ్రామిక దేశంగా తప్పక నిర్మించగలం. (హర్షధ్వానాలు) మనదేశంలో నిర్మాణకార్యక్రమానికి మన కాంగ్రెస్ చాలా దోహదం చేయగలదు (హర్షధ్వానాలు.)

మన మహాసభకు, కమ్యూనిస్టు పార్టీల, కార్మిక - ప్రజావిప్లవపార్టీల ప్రతినిధులు 50 దేశాలనుండి వచ్చి మన మధ్య నున్నారు. (దీర్ఘ హర్షధ్వానాలు.) వారు తామార్క్సిస్టు - లెనినిస్టులు. మనదీ వారిదీ ఒకేవాక్కు (హర్షధ్వానాలు). మహోన్నత మైత్రీ భావంతో వారంతా ఈ మహాసభలో పాల్గొనడానికి చాలా దూరప్రయాణం చేసివచ్చారు. ఇది మనకు ప్రోత్సాహకరమైన విషయం. మనలను బలపరచే విషయం. (హర్షధ్వానాలు) వారికి మన హృదయపూర్వక స్వాగతంచెబుదాం. (హర్షధ్వానాలు)

మన దేశంలోని ప్రజాతంత్ర పార్టీల ప్రతినిధులు, ఏ పార్టీకిచెందని ప్రజాతంత్రవాదులుకూడా ఈ మహాసభకువచ్చారు. (హర్షధ్వానాలు) వారు మనతో కలసి పనిచేసే సన్నిహిత మిత్రులు. (హర్షధ్వానాలు) వారు మనకు చాలా సహాయం చేశారు. (హర్షధ్వానాలు) వారికి మనహృదయపూర్వక స్వాగతం. (దీర్ఘ హర్షధ్వానాలు).

సుంచోంగ్ డైరీ

(8 వ పేజీ తరువాయి)

వచ్చి, మన పరిస్థితి క్లిష్టంగా ఉన్న రోజులలో మన సేనానాయకుడికి అభివందనలు పంపుతూ జెవరలిస్మో స్టాలిన్ ఇలా అన్నాడు: "ఎన్నో ఏళ్లుగా స్వతంత్ర ఐక్య ప్రజాస్వామిక కొరియాను నిర్మించటానికి పోరాటం సాగిస్తున్న కొరియా ప్రజలు తమ స్వాతంత్ర్య రక్షణలో విజయం సాధించాలని కోరుకున్నాను." ... మన ప్రజలకు మిత్రుడు అలా చెప్పాడు.

సైనికులు కిమిల్సెను మీద పాట పాడుతూ దక్షిణాభిముఖులై నడవసాగారు.

ముందు ముందు ఇంకా ఎన్నో పోరాటాలు, ఎన్నో ఇక్కట్లు, ఎన్నో పరీక్షలున్నాయని వాళ్ళకు తెలుసు అయితే, మానవజాతికి శత్రువులైన వారి ఓటమి కూడా తప్పకుండా, తమకు విజయం చేకూరుతుందని వారికి తెలుసు. మన్నే, కొరియా! స్వతంత్ర స్వేచ్ఛా కొరియా! మన్నే, ప్రపంచశాంతి!

(సమాప్తం)

ప్రశ్నలు

శ్రీ "అడుసుమిల్లి"

పైరు పెరిగున్నాది
పంట రాబోతోంది
పాలెకాపా నీకు
పండగా? ఎండగా?
వరిదుబ్బు కంకేసె
లేదూడ రంకేసె
రైతుబాబూ నీకు
గణ్ణమా? దణ్ణమా?
సాగులో తడిసితివి
వరదలో మునిగితివి
ఈ యేడు ధరవరలు
వాటమా? ఓటమా?
ఎరువు నను వేసితివి
అనువు దెచ్చితి వెచటో
ఆ బాకీతో బొందె
కైలాసమా? వాసమా?
ఎలుకలూ మిడుతలూ
అతి అనావృష్టులూ
ఈ పాలుగింజలను రానిచ్చునా
బువ్వతిన నిచ్చునా?
గుత్త వ్యాపారులకు
పెట్టుబడి దారులకు
డబ్బు వతిడికి యిక
దాసోహమా? లేకధీరత్వమా?
రానివ్వు కడగండ్లు
వేవేల వడగళ్ళు
రైతుబాబూ ఇదేగుర్తుంచుకో
రాజనాలాపంటనీస్వంతమే!

స్వీకారం

శ్రీ భారతీ సమితి
(దుర్ముఖి భాద్రపద మాసపంచిక)
సంపాదకుడు: శ్రీ కోగంటి దుర్గా మల్లికార్జునరావు
వెల రు 0-4-0
ప్రతులకు: సంపాదకుని చిరునామాకు, కృష్ణాజిల్లా అని వ్రాయాలి.

* * *

ఫిలిమ్ డైరీ '56
వెల: రూపాయి
మహేంద్ర అండ్ కో, విజయనగరం.

* * *

సమీక్ష
రచన: శ్రీ విద్వాన్ కేవరకొండ చిన్నకృష్ణశర్మ
వెల: రూపాయి
ప్రతులకు: సీతారామ్ అండ్ కో, విజయవాడ.

* * *

అభినవ దాశరథీ శతకము
(స్వగతము)
రచన: శ్రీ వల్లభనేని
వెల: రెండణాలు
ప్రతులకు: లీలా బ్రదర్సు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

* * *

బంగారుపాప (పిల్లల మాసపత్రిక)
సంపాదకుడు:
శ్రీ రావి కొండలరావు.
వెల: మూడణాలు.
ప్రతులకు: 'బంగారుపాప' కార్యాలయం, శ్రీకాకుళం.

1957 ఏప్రిల్ 1వ తేదీనుంచి అమల్లోకి రానున్న
కొత్త నాణెములు - రెండు వైపులా వాటి నమూనా స్వరూపం



ఇందులో వరుసనే ఒక నయాపైసా, [illegible] నయాపైసలు, [illegible] వలా (2 నయాపైసలు)
అర్ధరూపాయి (50 నయాపైసలు) రూపాయి (100 నయాపైసలు) చూడవచ్చు.